VC NEWS

# వేగుచుక్క

పీడిత ప్రజల గొంతుక...

TELUGU DAILY NEWS

www.veguchukkanews.com

నిజామాబాద్ సోమవారం 02 జూన్ 2025

వెల: రూ.3/- పేజీలు : 4 సంపుటి:02 సంచిక: 317

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD




**భీకర దాడి.. రష్యాపై విరుచుకుపడిన ఉక్రెయిన్**

# కాంగ్రెస్ పాలనలో రాష్ట్రం అధోగతి

**'కాంగ్రెస్ పాలనలో రాష్ట్రం అధోగతి పాలైంది. కనుచూపుమేరలో ముందుకెళ్లే పరిస్థితి లేదు. భాజపా డబుల్ ఇంజిన్ సర్కారు అధికారంలోకి వస్తేనే రాష్ట్రానికి భవిష్యత్తు ఉంటుంది' అని కేంద్ర మంత్రి, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి అన్నారు.**



హైదరాబాద్: 'కాంగ్రెస్ పాలనలో రాష్ట్రం అధోగతి పాలైంది. కనుచూపుమేరలో ముందుకెళ్లే పరిస్థితి లేదు. భాజపా డబుల్ ఇంజిన్ సర్కారు అధికారంలోకి వస్తేనే రాష్ట్రానికి భవిష్యత్తు ఉంటుంది' అని కేంద్ర మంత్రి, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి అన్నారు. ఆదివారం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన కార్యశాలలో ఆయన మాట్లాడారు. మోదీ 11 ఏళ్ల సుపరిపాలనపై భాజపా శ్రేణులు గ్రామగ్రామాన ప్రచారం చేయాలన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో భాజపా అధికారంలోకి వచ్చే అవకాశం ఉందన్న ఆశాభావం వ్యక్తంచేశారు. "ప్రధాని మోదీ నేతృత్వంలో 11 ఏళ్లుగా దేశంలో అవినీతిరహిత పాలన కొనసాగుతోంది. అంతకుముందు యూపీఏ హయాం మొత్తం కుంభకోణాలమయమే. దేశం అన్నిరంగాల్లో అభివృద్ధి చెందింది మోదీ హయాంలోనే. ఏడాదిన్నరలో కాంగ్రెస్ రాష్ట్రాన్ని ఎలా అధోగతి పాల్జేసిందో ప్రజలకు చెప్పాలి. ఇచ్చిన హామీలన్నీ ఎటువెళ్లాయి? 6 గ్యారంటీలు, 420 సబ్ గ్యారంటీలు అమలు చేయలేదు. తెలంగాణలో కుటుంబ డ్రామాలు నడుస్తున్నాయి. అవినీతితో దోచుకున్న డబ్బుల కోసం భారాసలో గొడవ నడుస్తోంది. ఆస్తులు, అధికారం కోసమే ఆ గొడవలు.

వాటితో ప్రజలకు, భాజపాకు ఎలాంటి సంబంధం లేదు. కాంగ్రెస్, భారాసలు తెలంగాణను ఆర్థిక సంక్షోభంలోకి నెట్టేశాయి. రాష్ట్రంపై ఇప్పుడు రూ.10 లక్షల కోట్ల అప్పుల భారం ఉంది. ఒక్క సింగరేణికే రాష్ట్ర ప్రభుత్వం రూ.42 వేల కోట్ల బకాయిలు చెల్లించాల్సి ఉంది. కాంగ్రెస్ దేశానికి ఇచ్చిన శాపం పాకిస్థాన్ బెడద. ఆర్టికల్ 370, ఐఎస్ఐ ఉగ్రవాదం, పహల్గాం ఘటన ఇవన్నీ కాంగ్రెస్ ఇచ్చిన శాపాలే. వారి పాకిస్థాన్ అనుకూల విధానాల కారణంగానే దేశం ఉగ్రవాద కార్యకలాపాలను భరించాల్సిన దుస్థితి నెలకొంది.



# రాజీవ్ యువ వికాసం

## లోతైన పరిశీలన తర్వాతే..

**రాజీవ్ యువ వికాసానికి ఊహించిన దానికంటే ఎక్కువ సంఖ్యలో దరఖాస్తులు అందాయని, అనర్హులకు యువ వికాసం అందకుండా చూడాలంటూ పెద్ద ఎత్తున వినతులు వచ్చాయని మంత్రులు... ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు.**

హైదరాబాద్: రాజీవ్ యువ వికాసానికి ఊహించిన దానికంటే ఎక్కువ సంఖ్యలో దరఖాస్తులు అందాయని, అనర్హులకు యువ వికాసం అందకుండా చూడాలంటూ పెద్ద ఎత్తున వినతులు వచ్చాయని మంత్రులు... ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. "పెద్ద సంఖ్యలో వచ్చిన దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ కొనసాగుతున్న నేపథ్యంలో.. పూర్తి స్థాయి పరిశీలన తర్వాతే.. అర్హుల జాబితాలను ప్రకటించాలి. మరింత లోతుగా విశ్లేషించి.. అర్హులను గుర్తించాలి. ఒక్క అనర్హుడికి కూడా రాజీవ్ యువ వికాసం ద్వారా లబ్ధి చేకూరవద్దు. ఈ అంశంపై క్యాబినెట్‌లో చర్చించి నిర్ణయం తీసుకోవాలి" అని సమావేశంలో నిర్ణయించారు. రాష్ట్రప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన రాజీవ్ యువ వికాసం పథకంలో ఎంపికైన వారికి ఈనెల 2న మంజూరు పత్రాలు ఇవ్వాలని తొలుత ప్రభుత్వం భావించింది. ఈ మేరకు కేటగిరీ-1, 2లో ఎంపికైన వారికి మంజూరు పత్రాలను సిద్ధం చేసింది. అయితే భారీగా దరఖాస్తులు వచ్చిన నేపథ్యంలో.. ఈ మంజూరు పత్రాల జారీ ప్రక్రియను తాత్కాలికంగా వాయిదా వేయాలని, ఈ నెల 5న మంత్రివర్గ సమావేశం నిర్వహించి కీలక అంశాలను చర్చించాలని తాజాగా మంత్రులతో సీఎం రేవంత్‌రెడ్డి నిర్వహించిన సమావేశంలో నిర్ణయించారు. ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ఆదివారం సాయంత్రం 4.30 గంటలకు మంత్రులతో ముఖ్యమంత్రి రేవంత్ నిర్వహించిన భేటీలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఈ సమావేశానికి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మినహా మిగిలిన మంత్రులంతా హాజరయ్యారు. బుధవారం రాత్రి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన నివాసంలో మంత్రులందరికీ విందు ఇచ్చిన.. కొద్దిరోజుల్లోనే మరోసారి మంత్రివర్గ సహచరులతో ఆదివారం భేటీ అయ్యారు. ఉద్యోగుల సమస్యలపై కమిటీ నివేదిక గురించి వివరించిన భట్టి

గత నెల 29, 30 తేదీలలో అన్ని జిల్లాల్లో పర్యటించిన మంత్రులు రాష్ట్ర అవతరణ వేడుకలు, ఇందిరమ్మ ఇళ్లు, రెవెన్యూ సదస్సులు, వానా కాలం పంటల సాగు సన్నద్ధత తదితర అంశాలపై చర్చించారు. ఈ నాలుగు అంశాలపై అధికారులతో సమీక్షలు నిర్వహించారు. అవతరణ దినోత్సవ ఏర్పాట్లతో పాటు ఈ అంశాలపై జిల్లాల వారీగా అధికారులు తయారు చేసిన నివేదికలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి

అందించారు. ఉద్యోగుల సమస్యలపై నియమించిన కమిటీకి సంబంధించి అధికారులు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు ఇప్పటికే నివేదిక అందించారు. ఆ నివేదికపై ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, మంత్రులకు వివరించారు. దీనిపై క్యాబినెట్‌లో చర్చించి సమస్యల పరిష్కారంపై ఎలా ముందుకెళ్లాలో నిర్ణయం తీసుకోనున్నారు.

## డాలస్‌లో కేటీఆర్‌కు ఘన స్వాగతం



హైదరాబాద్: అమెరికా పర్యటనలో భాగంగా ఆదివారం డాలస్‌కు చేరుకున్న భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ మంత్రి కేటీఆర్‌కు తెలంగాణ ప్రవాసులు, పార్టీ ముఖ్య నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. డాలస్‌లోని డాక్టర్ పెప్పర్ ఎరినా ప్రాంగణంలో జూన్ 1 సాయంత్రం 4 గంటలకు (భారత కాలమాన ప్రకారం జూన్ 2 తెల్లవారుజామున 3 గంటలకు) నిర్వహించనున్న భారాస రజతోత్సవాలు, తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకలకు కేటీఆర్ ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారు. మే 27వ తేదీన యూకేకు చేరుకున్న ఆయన అక్కడ మూడు రోజుల పాటు వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. యూకే పర్యటనలో తనకు సహకరించిన తెలంగాణ ప్రవాసులు, భారాస నాయకులు, అభిమానులకు కేటీఆర్ కృతజ్ఞతలు తెలిపారు.



## యాదగిరిగుట్టలో భక్తజన సందోహం

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి పుణ్యక్షేత్రానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. దర్శనానికి బారులు తీరిన భక్తులతో క్యూ కాంప్లెక్స్ కిక్కిరిసిపోయింది. మాడ వీధుల్లో కోలాహలం నెలకొంది. ప్రసాదాల కొనుగోలుకు భక్తులు భారీగా బారులు తీరారు. నిత్యారాధనలతో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. తెల్లవారుజాము నుంచి రాత్రి వరకు రద్దీ కొనసాగగా.. సుమారుగా 90వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారని డీఈవో భాస్కర్‌శర్మ తెలిపారు. వివిధ విభాగాల నుంచి ఆలయానికి రూ.79,51,701 ఆదాయం సమకూరిందని వెల్లడించారు.




## తెలంగాణ జాగృతి అనుబంధ సంస్థగా యూపీఎఫ్

**కన్వీనర్ గా బొల్లా శివశంకర్**

**యూపీఎఫ్ నూతన కార్యవర్గం ప్రకటన**

హైదరాబాద్ :

తెలంగాణ జాగృతి అనుబంధ సంస్థగా యునైటెడ్ ఫూలే ఫ్రంట్ పని చేస్తుందని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ప్రకటించారు. ఆదివారం తెలంగాణ జాగృతి కార్యాలయంలో యూపీఎఫ్ నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా యూపీఎఫ్ నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. యూపీఎఫ్ కన్వీనర్ గా బొల్లా శివశంకర్, కో ఆర్డినేటర్ గా ఆలకుంట హరి, అడ్వైజర్ గా గట్టు రామచందర్ రావు, మరో 50 మందిని కో కన్వీనర్లుగా నియమించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ, తెలంగాణ జాగృతి, యూపీఎఫ్ ఐక్య పోరాటాలతోనే కాంగ్రెస్ ప్రభుత్వం దిగివచ్చి బీసీలకు స్థానిక సంస్థల్లో, విద్య, ఉద్యోగాల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ వేర్వేరు బిల్లులు ప్రవేశపెట్టిందన్నారు. అనేక పోరాటాలతో సాధించు కున్న బీసీ రిజర్వేషన్లు అమల్లోకి తెచ్చే వరకు తెలంగాణ జాగృతి, యూపీఎఫ్ ఉద్యమాలను కొనసాగిస్తామన్నారు. కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం, తెలంగాణలోకి కాంగ్రెస్ ప్రభుత్వం కూడబలుక్కొని బీసీ బిల్లులను కోల్డ్ స్టోరేజీలో పెట్టే కుట్రలు చేస్తున్నాయని మండిపడ్డారు. త్వరలోనే బీసీ బిల్లులు సాకారం అయ్యేందుకు కార్యచరణ ప్రకటిస్తామన్నారు. యూపీఎఫ్ కన్వీనర్ బొల్లా శివశంకర్ మాట్లాడుతూ.. బీసీల రిజర్వేషన్లను అమల్లోకి తీసుకురావడమే ఐకైక లక్ష్యంగా తెలంగాణ జాగృతి, యూపీఎఫ్ ఆధ్వర్యంలో ఐక్య ఉద్యమాలు కొనసాగిస్తామన్నారు. పెంచిన రిజర్వేషన్లను అమలు చేయకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎలా కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నాయో ప్రజలకు విడమరిచి చెప్తామన్నారు. బీసీలందరినీ ఒక్కతాటిపైకి తీసుకువచ్చి రిజర్వేషన్లను సాధించి తీరుతామన్నారు. యూపీఎఫ్ కో కన్వీనర్లుగా ఆర్ వి మహేందర్, కోల శ్రీనివాస్, నరహరి, విజయేంద్ర సాగర్, మల్లేష్ గౌడ్, గొరిగే నరసింహ, గోవర్ధన్ యాదవ్, గుర్రం శ్రవణ్, టి నరేష్ కుమార్, డి కుమార స్వామి, ఏతరి మారయ్య, కే ప్రవీణ్, రాచమల్ల బాలకృష్ణ, మురళి కృష్ణ, సల్వా చారి, ఫరూక్, కే శ్రీనివాస్, స్రవంత్, రాజు, నాగరాజు, అఖిల్, పరమేశ్వరి, కే వెంకటేష్, అశోక్ రెడ్డి, మాధవ్, మేన గోపీ, జహంగీర్ పాషా, లక్ష్మణ్, నరసింహులు, వి యాదగిరి రావు, లక్ష్మీ నారాయణ, సత్యనారాయణ, గుంటి మంజుల, గీత గౌడ్, రమాదేవి, నిమ్మల నగేష్, కృష్ణమాచారి, తారా సింగ్, శైల, పర్వతాలు, కృష్ణ, టి కలపూర్ణ, శ్రీనివాస్, ఆంజనేయులు, షేక్ లతీఫా, సర్సింహ రాజు, గాదె సామయ్య, శివాజీ, చత్రి మంజుల సాగర్, జె లలితా జగన్ లను నియమించారు

## అందాల పోటీలకు వెళ్లిన సీఎం..

# ధాన్యం కేంద్రాలకు ఎందుకు వెళ్లలేదు?

**రాష్ట్రంలో నిర్వహించిన అందాల పోటీలను చూసేందుకు పలుమార్లు వెళ్లిన సీఎం రేవంత్‌రెడ్డి.. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులు పడుతున్న అవస్థలను చూసేందుకు ఎందుకు వెళ్లలేకపోయారని భారాస నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు ప్రశ్నించారు.**




జగదేవపూర్: రాష్ట్రంలో నిర్వహించిన అందాల పోటీలను చూసేందుకు పలుమార్లు వెళ్లిన సీఎం రేవంత్‌రెడ్డి.. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులు పడుతున్న అవస్థలను చూసేందుకు ఎందుకు వెళ్లలేకపోయారని భారాస నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు ప్రశ్నించారు. సిద్దిపేట జిల్లా జగదేవపూర్, ములుగు, వర్గల్ మండలాల్లో ఆదివారం నిర్వహించిన భారాస కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. గత నెలలో భారాస రజతోత్సవ సభకు హాజరై రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వర్గల్ మండలం తునికిమక్తా గ్రామానికి చెందిన కనకయ్య కుటుంబసభ్యులకు రూ.5 లక్షల చెక్కును అందజేశారు. అనంతరం హరీశ్‌రావు మాట్లాడుతూ.. విందులు, వినోదాల కోసమే రాష్ట్ర ప్రభుత్వం రూ.200 కోట్లు ఖర్చు పెట్టి అందాల పోటీలు నిర్వహించిందని ఆరోపించారు. ఈ పోటీల వల్ల ఎవరికి లాభం కలిగిందో చెప్పాలని డిమాండ్ చేశారు. మాటలతో పబ్బం గడుపుతున్న ముఖ్యమంత్రి రేవంత్ హామీల అమలులో ఘోరంగా విఫలమయ్యారని దుయ్యబట్టారు. ఈ కార్యక్రమాల్లో ఎమ్మెల్సీ యాదవరెడ్డి, వంటేరు ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వేగుచుక్క

# జూన్ 2న పెద్ద పండుగ..

## ఎన్ని కొత్త పథకాలు ప్రారంభం అంటే



తెలంగాణ: తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలను ప్రారంభించనుంది. ఇందులో భాగంగా ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభోత్సవం, రైతు భరోసా నిధుల విడుదల, ఉద్యోగులకు డీఏ ప్రకటన వంటి ముఖ్యమైన కార్యక్రమాలు జూన్ 2 నుంచి అమల్లోకి రానున్నాయి. అంతేకాకుండా, అసైన్డ్ భూములకు పట్టాలు ఇవ్వడంతో పాటు భూ సమస్యలపై ప్రత్యేక సదస్సులు నిర్వహించనున్నారు.

తెలంగాణ అవిర్భావ దినోత్సవం సందర్భంగా రాష్ట్రంలో పెద్ద పండుగ రాబోతుంది. పలు సంక్షేమ పథకాలకు జూన్ 2న ముహూర్తంగా ఫిక్స్ చేసింది రేవంత్ సర్కార్. కీలక నిర్ణయాలు, కొత్త పథకాల అమలు జూన్ 2 నుంచే మొదలు కానుంది. ఇప్పటికే పలు పథకాలపై అప్డేట్ వచ్చిన సంగతి తెలిసిందే. మరి జూన్ 2 తెలంగాణలో మొత్తం ఎన్ని కొత్త పథకాలు మొదలు కాబోతున్నాయి.. ఎలాంటి కీలక నిర్ణయాలు అమల్లోకి రానున్నాయి అంటే..

జూన్ 2, తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా.. తెలంగాణ సర్కార్ ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభోత్సవం, రాజీవ్ యువ వికాసం తొలి విడత నిధులు మంజూరు, మిగిలి ఉన్న రైతులకు రైతు భరోసా నిధులు, ప్రభుత్వ ఉద్యోగులకు పెండింగ్ డీఏ ప్రకటన వంటి పథకాలు, నిర్ణయాలు అమలు చేసేందుకు రెడీ అవుతోంది. వీటితో పాటు గ్రామ పాలన అధికారులకు అపాయింట్మెంట్లు ఇవ్వనుంది. అసైన్డ్ భూములు సాగు చేస్తున్న పేద రైతులకు పట్టాలు మంజూరు చేయనున్నారు.

అలానే జూన్ మూడో తేదీన భూ సమస్యల పరిష్కారం, రెవెన్యూ రికార్డుల ప్రక్షాళన కోసం నుంచి రెవెన్యూ సదస్సులను ప్రారంభించ నుంది. ఇప్పటికే పైలెట్ మండలాల్లో సదస్సులు నిర్వహి స్తున్నారు అధికారులు. వీటికి మంచి స్పందన వస్తోంది అంటున్నారు అధికారులు. జూన్ 3 రాష్ట్రవ్యాప్తంగా సదస్సులు నిర్వహించను న్నారు. అలానే రైతు భరోసా పథకం కింద పెండింగ్‌లో ఉన్న నిధులను విడుదల చేయనుంది. మే నెలలో వీటిని చెల్లించాల్సి ఉండే. కానీ పరిస్థితులు అనుకూలించకపోవడం వల్ల వాయిదా పడింది.

అలానే గ్రామ స్థాయిలో మెరుగైన పరిపాలన అందించేందుకు గాను రేవంత్ స్కార్ కీలక నిర్ణయం తీసుకుంది. దీనిలో భాగంగా.. తెలంగాణ ప్రభుత్వం గ్రామ పంచాయతీ ఆఫీసర్ (జీపీవో) పోస్టులను భర్తీ చేస్తోంది. ఈ క్రమంలో జూన్ 2న తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా దాదాపు 3,500 మందిని రెవెన్యూ శాఖలోకి తీసుకునేందుకు రేవంత్ సర్కార్ సిద్ధం అయ్యింది. వీరికి జూన్ 2 రీఅపాయింట్మెంట్ లెటర్లు అందజేయనున్నారు. అలానే ప్రభుత్వ ఉద్యోగుల డిమాండ్లపైనా కూడా కాంగ్రెస్ ప్రభుత్వం

జూన్ 2న కీలక ప్రకటన చేయనున్నట్లు విశ్వసనీయ వర్గాలు వెల్లడిస్తున్నారు. దీనిలో భాగంగా పెండింగ్ డీఏ విడుదలపై ప్రకటన ఉంటుందని భావిస్తున్నారు.తెలంగాణ అవిర్భావ నోత్సవాన్నిపురస్కరించు

కుని.. కాంగ్రెస్ ప్రభుత్వం పలు నూతన సంక్షేమ పథకాలు, కీలక నిర్ణయాలు ప్రకటించి..రాష్ట్రంలో పండగ వాతావరణం నెలకొనేలా చేయనుంది.

## ముస్లిం ఓట్ల కోసమే సిందూర్‌పై మమత వ్యతిరేకత



కోల్‌కతా: ముస్లిం ఓటుబ్యాంకును సంతృప్తిపరచడానికే ఆపరేషన్ సిందూర్, వక్ఫ్ సవరణ చట్టాలను పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ వ్యతిరేకిస్తున్నారని కేంద్ర హోంమంత్రి అమిత్ షా విమర్శించారు. బెంగాల్‌లోని ముర్షిదాబాద్‌లో మతపరమైన అల్లర్లు రాష్ట్ర ప్రాయోజితమని, తృణమూల్ కాంగ్రెస్‌కు చెందిన అనేకమంది సీనియర్ నాయకులు వాటిలో పాల్గొన్నారని ఆరోపించారు. ఆ అల్లర్లను ఎదుర్కొనేందుకు సరిహద్దు భద్రత దళాన్ని పంపిస్తామంటే తృణమూల్ సర్కారు అంగీకరించలేదని, వారు వచ్చిఉంటే హిందువుల్ని కాపాడటం వీలయ్యేదని చెప్పారు. ఆదివారం కోల్‌కతాలో భాజపా నాయకులు, కార్యకర్తలను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు.

సిందూరం విలువ అర్థమయ్యేలా చెప్పండి

"ఆపరేషన్ సిందూర్‌ను వ్యతిరేకించడం ద్వారా స్థాయి దిగజార్చుకుని మమత మనదేశ మాతృమూర్తుల్ని, సోదరీమణుల్ని అవమానిస్తున్నారు. ఆమె కోట్లమంది ఆడబిడ్డల భావోద్వేగాలను కించపరిచారు. సిందూరానికి ఉన్న విలువేమిటో ఇలాంటివారికి అర్థమయ్యేలా చెప్పండి. 2026 అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్ర ఆడబిడ్డలు ముఖ్యమంత్రికి, తృణమూల్ కాంగ్రెస్‌కు గుణపాఠం నేర్పిస్తారు. బంగ్లాదేశ్ చొరబాటుదారుల కోసం సరిహద్దుల్ని మమత తెరిచి ఉంచారు. దేశ భద్రతతో ముడిపడిన తదుపరి ఎన్నికల్లో రాష్ట్ర సర్కారును కూకటివేళ్లతో పెకిలించడానికి భాజపా శ్రేణులు పాటుపడాలి. బెంగాల్‌లో రాబోయేది భాజపా ప్రభుత్వమే. హింసాత్మక మార్గంలో వెళ్లకుండా ఎన్నికల్లో డిపాజిట్లను దక్కించుకోవడం మమతకు కూడా కష్టం. ఆమె అధికారంలోకి వచ్చాక.. బెంగాల్‌ను అక్రమ చొరబాట్లు, నేరాలు, అవినీతి, అత్యాచారాలు, దాడులకు అడ్డాగా మార్చారు. వందలమంది భాజపా కార్యకర్తలు హత్యకు గురయ్యారు" అని అమిత్ షా చెప్పారు. సరిహద్దు భద్రత దళం (బీఎస్ఎఫ్) కోసం అవసరమైన భూమిని బెంగాల్ సర్కారు కేటాయిస్తే చొరబాట్లను అడ్డుకుంటామని చెప్పారు. అక్రమ చొరబాట్ల ద్వారానే తృణమూల్ పార్టీ అధికారంలో ఉంటోందని, అందుకనే భూమిని కేటాయించడం లేదని ఆరోపించారు.

రూ.2,800 కోట్లతో ఫోరెన్సిక్ ల్యాబ్‌ల ఆధునికీకరణ

దేశంలో ఫోరెన్సిక్ ప్రయోగశాలల ఆధునికీకరణ, మౌలిక సదుపాయాల కల్పనకు రూ.

2,800 కోట్లు వెచ్చించాలని కేంద్రం యోచిస్తున్నట్లు అమిత్ షా చెప్పారు. కేసులను

ఛేదించడంలో

ఈ ల్యాబ్‌లు అందిస్తున్న సేవలు విలువైనవని కొనియాడారు. కోల్‌కతా శివార్లలో కేంద్ర ఫోరెన్సిక్ సైన్స్ ప్రయోగశాలను ఆయన ప్రారంభించారు. పేదలకు సత్వర న్యాయం జరగడానికి, కేసులలో అమాయకులు బలికాకుండా చూడడానికి నేరశిక్షా స్మృతుల్లో మార్పులు చేసినట్లు తెలిపారు.

## భీకర దాడి.. రష్యాపై విరుచుకుపడిన ఉక్రెయిన్

కీవ్, మాస్కో:శాంతి చర్చల నేపథ్యంలో నివురుగప్పిన నిప్పులా ఉన్న రష్యా, ఉక్రెయిన్ యుద్ధం ఆదివారం తీవ్రరూపం దాల్చింది. రష్యాలోని వైమానిక స్థావరాలను లక్ష్యంగా చేసుకుని ఉక్రెయిన్ విరుచుకుపడగా.. ఉక్రెయిన్‌లోని సైనిక శిక్షణ కేంద్రంపై రష్యా దాడి చేసింది. 472 డ్రోన్లను ఆ దేశంపైకి ప్రయోగించింది. ఈ దాడుల్లో రెండు దేశాలు తీవ్రంగా నష్టపోయాయి. రష్యాకు చెందిన 41 యుద్ధ విమానాలు ధ్వంసం కాగా.. ఉక్రెయిన్‌కు చెందిన 12 మంది సైనికులు మరణించారు. రష్యా, ఉక్రెయిన్ మధ్య సోమవారం తుర్కియేలోని ఇస్తాంబుల్‌లో శాంతి చర్చలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో ఉక్రెయిన్ భారీ దాడులు చేయడం కలకలం రేపింది. ఆదివారం రష్యాలోని వైమానిక స్థావరాలపై దాడిని అధ్యక్షుడు జెలెన్స్కీ స్వయంగా పర్యవేక్షించారు. ఈ దాడులకు ఏడాదిన్నర నుంచి ఆ దేశం ప్రణాళిక రచించినట్లు తెలిసింది. దాడుల కోసం ఉక్రెయిన్ డ్రోన్లను కంటెయినర్లలో రష్యాలోకి తరలించింది. అందుకే రష్యా భూభాగంలో 4,000 కిలోమీటర్ల లోపలికి చొచ్చుకుని వెళ్లి మరీ దాడులు చేయగలిగింది. మధ్యాహ్నం సమయంలో ఇర్కుట్స్క్ ప్రాంతంలోని పలు వైమానిక స్థావరాలపై దాడులు చేయడంతో 41 యుద్ధ విమానాలు ధ్వంసమయ్యాయి. ఈ ప్రాంతంలో ఉక్రెయిన్ దాడులు చేయడం ఇదే తొలిసారి. దీంతోపాటు ర్యాజన్, ముర్మన్స్క్ ప్రాంతాల్లోనూ ఉక్రెయిన్ డ్రోన్లతో దాడులు చేసిందని రష్యన్ అధికారులుతెలిపారు. అయితే వివరాలు వెల్లడికాలేదు. ఉక్రెయిన్ దాడి చేసినట్లు రష్యాలోని ఇర్కుట్స్క్ గవర్నర్ ధ్రువీకరించారు. ఆ దేశానికి చెందిన రిమోట్ పైలట్ ఎయిర్‌క్రాఫ్ట్ తమ మిలిటరీ యూనిట్‌ను ధ్వంసం చేసినట్లు పేర్కొన్నారు. ఒలెన్యా, బెలయా సహా నాలుగు మిలిటరీ ఎయిర్‌బేస్‌లపై దాడులు జరిగినట్లు వెల్లడించారు. ఉక్రెయిన్ సెక్యూరిటీ సర్వీస్ చేపట్టిన ఈ ఆపరేషన్‌లో టీయూ-95, టీయూ-22ఎం3 బాంబర్లు, కీలకమైన ఏ-50 ఎయిర్ క్రాఫ్ట్ ధ్వంసమైనట్లు సమాచారం. కంటెయినర్‌లో రహస్యంగా తరలించిన డ్రోన్లు ఇవి ఉగ్ర దాడులే: రష్యాఉక్రెయిన్ తమపై ఉగ్ర దాడులు చేసిందని రష్యా రక్షణ మంత్రిత్వశాఖ పేర్కొంది. ముర్మన్స్క్, ఇర్కుట్స్క్, ఇవానోవా, ర్యాజన్, అముర్ ప్రాంతాలపై దాడులు జరిగాయని వెల్లడించింది. అన్ని దాడులను తిప్పికొట్టామని తెలిపింది. వైమానిక స్థావరాలకు దగ్గరి నుంచి ఎఫ్‌పీవీ డ్రోన్లతో దాడులు చేయడంతో వైమానిక సామగ్రి మంటల్లో చిక్కుకుందని వివరించింది. రష్యాలోకి డ్రోన్లను తరలించిన ట్రక్కు డ్రైవరును పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. రష్యాలోని ఉక్రెయిన్‌కు సరిహద్దు ప్రాంతం కర్స్క్‌లో వంతెన కూలిపోవడంతో ధ్వంసమైన గూడ్సు రైలుమరో వంతెన ధ్వంసంరష్యా పశ్చిమ ప్రాంతంలో మరో వంతెన ధ్వంసమైంది. బ్రయాన్స్క్ సరిహద్దు ప్రాంతంలో శనివారం రైలుపై వంతెన కూలడంతో పట్టాలు తప్పి ఏడుగురు మరణించిన ఘటన జరిగి 24 గంటలు కాకముందే మరో రైలు పట్టాలు తప్పిందని అధికారులు తెలిపారు.

ఉక్రెయిన్‌కు సరిహద్దులో ఉండే కర్స్క్ ప్రాంతంలో మరో వంతెన పడి గూడ్స్ రైలు పట్టాలు తప్పిందని తాత్కాలిక గవర్నర్ అలెగ్జాండర్ ఖిన్‌షేన్ పేర్కొన్నారు.వెయ్యి కి.మీ. లోనికి వెళ్లి..ఉక్రెయిన్‌లో 1,000 కిలోమీటర్ల దూరం వెళ్లి రష్యా అతి పెద్ద దాడి చేసింది. 472 డ్రోన్లను ప్రయోగించింది. యుద్ధం మొదలయ్యాక ఇదే అతి పెద్ద దాడి అని ఉక్రెయిన్ అధికారులు తెలిపారు. సైనిక శిక్షణ కేంద్రంపై జరిగిన దాడిలో 12 మంది సైనికుల మృతితో పాటు 60 మందికిపైగా గాయపడ్డారు. ఒలెక్సివ్‌కా గ్రామాన్ని స్వాధీనం చేసుకున్నామని రష్యా ప్రకటించింది.

వేగుచుక్క

# రచయితలు "రాజ్యం" గుట్టును బయటపెట్టాలి

**అరుణోదయ విమలక్క పిలుపు.**

**ఆద్యకళను పరిరక్షించుకోవాలి.**

**ఆచార్య జయధీర్ తిరుమలరావు.**

**ఘనంగా తెరవే రెండవ జిల్లా మహాసభలు.**






**వేగుచుక్క న్యూస్, కామారెడ్డి, జూన్ 1:**

శత్రు దేశంతో శాంతి చర్చలు జరుపుతున్న పాలకులు, తమ బిడ్డలపైననే యుద్ధం చేస్తున్నదని, రచయితలు "రాజ్యం" గుట్టును బట్టబయలు చేయాల్సిన అవసరం ఉందని అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య అధ్యక్షురాలు, గాయని విమలక్క అన్నారు. తెలంగాణ రచయితల వేదిక కామారెడ్డి జిల్లా శాఖ ఆధ్వర్యంలో జిల్లా రెండవ మహాసభలను కర్షక్ బి.ఎడ్ కళాశాలలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా తెరవే అధ్యక్షులు సిరిసిల్ల గఫూర్ శిక్షక్ అధ్యక్షతన జరుగగా, ఈ సభలకు ముఖ్యఅతిథిలుగా ఆద్యకళ వ్యవస్థాపకులు ఆచార్య జయధీర్ తిరుమలరావు, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య విమలక్క, తెలంగాణ రచయితల వేదిక రాష్ట్ర అధ్యక్షులు కొండి మల్లారెడ్డి అతిథులుగా హాజరయ్యారు.

**అరుణోదయ విమలక్క మాట్లాడుతూ,**

సరిహద్దుల ఆవల శత్రువులతో శాంతి చర్చలు జరుపుతున్న పాలకులు దేశంలో తమ బిడ్డలతో చర్చలు జరపడానికి మాత్రం విముఖంగా ఉన్నారని, తన బిడ్డలను తానే చంపుకునే స్థితికి దిగజారిందని ఆరోపించారు. దేశ సహజ వనరుల్ని,అటవీ సంపదను కార్పొరేట్ శక్తులకు ధారాదత్తం చేయటానికే ఆదివాసుల హక్కులను కాలరాస్తూ, మానవ హననానికి పూనుకున్నదని అన్నారు. కవులు, రచయితల పాలకుల గుట్టును బట్టబయలు చేయాలని పిలుపునిచ్చారు.

**తెరవే రాష్ట్ర అధ్యక్షుడు కొండి మల్లారెడ్డి మాట్లాడుతూ**

తెలంగాణ భాష,సాహిత్యం, సంస్కృతుల పరిరక్షణ కోసం తెరవే నిరంతరం కృషి చేస్తున్నదని అందులో భాగంగానే ఆచార్య జయదీర్ తిరుమలరావు ఆధ్వర్యంలో ఆద్యకళ ను స్థాపించడం జరిగిందని తెలిపారు.గత ఐదు దశాబ్దాలుగా తిరుమల రావు అలుపెరుగకుండా ఆదివాసీ,గిరిజన,జానపద కళాఖండాలు, పనిముట్లు, సంగీత వాధ్య పరికరాలను సేకరించి భావితరాలకు వారసత్వంగా అందించేందుకు జీవితకాలం శ్రమించారని తెలిపారు. అలాంటి ఆధ్యకళకు శాశ్వతంగా మ్యూజియం ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం ముందుకు వస్తే కొంతమంది విద్యార్థులను ఎగదోసి ఆద్యకల ను వ్యతిరేకిస్తున్నారని, దీనిని తేరవే తీవ్రంగా ఖండిస్తున్నదనీ, ప్రభుత్వం, ప్రజాస్వామ్యవాదులు, కవులు,రచయితలు స్పందించి ఆద్యకళ ను పరిరక్షించుకోవాల్సిన అవసరం ఉందని తెలియజేశారు.

**ఆచార్య జయధీర్ తిరుమలరావు మాట్లాడుతూ,**

తేరవే ఉద్యమ కాలం నుండి ప్రజల పక్షాన నిలబడి పనిచేస్తుందని,మారుతున్న సామాజిక పరిస్థితులను ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ ప్రణాళికలను రూపొందించుకుంటూ కార్యక్రమాల రూపకల్పన చేస్తూ ఆచరణలో ఉంచాలని సూచించారు.తేరవే నిబద్ధతతో పని చేస్తున్నందునే గతంలో తేరవేను నిషేధించాలని ప్రయత్నించారని తెరవే ఏనాడు వెనుకంజవేయ లేదని తెలిపారు. మారుతున్న దేశకాల పరిస్థితుల్లో కవులు,రచయితలు మౌనంగా ఉండడం ప్రమాదకరమని మరింత నిబద్ధతతో కవులు కలాలతో చైతన్య పరుస్తూ ముందుకు నడిపించాల్సిన అవసరం ఉన్నదని తెలిపారు.తెరవే తన అస్తిత్వాన్ని కాపాడుకుంటూనే తెలంగాణ అస్తిత్వ, భాషా, సంస్కృతుల పరిరక్షణకు పూనుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తెరవే వివిధ జిల్లాల నుండి వచ్చిన రచయితలు మరియు గాజోజు నాగభూషణం, భూర్ల వెంకటేశ్వర్లు, ఉదారి నారాయణ, జి లచ్చయ్య, యాదగిరి, ఆదేపు లక్ష్మణ్, ప్రేమ్ లాల్, నారాయణ గౌడ్, సి వి కుమార్, తోకల రాజేశం, నర్సింహారెడ్డి, మోహన్, లింగం, రామచంద్రం, విజయశ్రీ, మోహన్ రాజ్, రామచంద్రం తదితరులు పాల్గొన్నారు.

# కార్మిక వర్గం ఐక్యతతో హక్కులు సాధించాలి

**సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వీ.ప్రభాకర్**

**టియుసిఐ జిల్లా మహాసభల ఆహ్వాన సంఘం ఏర్పాటుకు సమావేశం**



**వేగుచుక్క న్యూస్, కామారెడ్డి, జూన్ 1:**

కార్మిక వర్గం ఐక్యతతో హక్కులు సాధించాలనీ సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వీ.ప్రభాకర్ పిలుపునిచ్చారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలోని సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ జిల్లా కార్యాలయంలో సెంటర్ ఆఫ్ ట్రేడ్ యూనియన్ ఆఫ్ ఇండియా (టియుసిఐ) ఆధ్వర్యంలో మొదటి జిల్లా మహాసభల సందర్భంగా ఆహ్వాన సంఘం ఏర్పాటు చేయడానికి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి టియుసిఐ జిల్లా అధ్యక్షులు ముత్తన్న అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ కార్యదర్శి వర్గ సభ్యులు వి ప్రభాకర్ హాజరై, మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్మిక విధులు, విధానాలపై చేసే పోరాటలు విజయవంతం కావాలి అంటే అసంఘటిత కార్మికులందరూ ఏకమై వారి హక్కుల కోసం పోరాటాలు నిర్వహించాలని అన్నారు.

ప్రపంచ అభివృద్ధి, కార్మికుల పాత్ర రెండూ విడదీయలేనివనీ అన్నారు. కార్మికులు లేకుండా ఒక్క క్షణం కూడా ఈ ప్రపంచం మనుగడ సాగించలేదనీ, ప్రపంచవ్యాప్తంగా అభివృద్ధి చెందిన, చెందుతున్న దేశాలు కార్మికుల శ్రమను గుర్తిస్తూ, వారికి పనికి తగ్గ వేతనం, సమాజంలో గౌరవం ఇస్తున్నాయనీ అన్నారు. కానీ మనదేశంలో కార్మికుల శ్రమకు గుర్తింపు లేకపోగా అడుగడుగునా అవమానాలేనాని, శ్రమకు తగ్గ ఫలితం అటుంచి, కనీస వేతనాల ఊసు కూడా లేదన్నారు. ముఖ్యంగా గత 11 సంవత్సరాల మోడీ ప్రభుత్వ పాలనలో కార్మికుల జీవన ప్రమాణాలు మరింత దిగజారాయనీ, బీజేపీ నాయకత్వంలోని మోడీ ప్రభుత్వం కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను అనుసరిస్తున్నదనీ, పెట్రోల్, డీజిల్ గ్యాస్, ఉప్పు పప్పులు, మంచి నూనె వంటి నిత్యావసర వస్తువుల ధరలను విపరీతంగా పెంచిందన్నారు. పేద, మధ్యతరగతి ప్రజల వినియోగ వస్తువులపై, రోగుల మందులు, గోలీలపై, చివరకు పిల్లలు చదువులు, చాక్ పీసులు, పెన్సిల్ ల పైన కూడా టాక్స్ లు వేస్తున్నదనీ పేర్కొన్నారు.

కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులను హరించివేస్తున్నదనీ, కార్పొరేట్ కంపెనీలకు అనుకూలమైన చట్టాలు తెచ్చే ప్రయత్నాలు చేస్తున్నదనీ, అందులో భాగంగానే దశాబ్దాలుగా కార్మికులు పోరాడి సాధించుకున్న చట్టాలను రద్దుచేసి, కార్మిక వ్యతిరేక 4 లేబర్ కోడ్ లను తెచ్చి అమలు చేయాలని చూస్తున్నదనీ అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టాల్సిన బాధ్యత ప్రధానంగా కార్మికవర్గం పైనే ఉన్నదనీ అన్నారు. ఈ నేపథ్యంలోనే రాష్ట్రంలో, ముఖ్యంగా మన జిల్లాలో మున్సిపల్, గ్రామపంచాయతీ కేజీబీవీ, మోడల్ స్కూల్, మిషన్ భగీరథ, భవన నిర్మాణ, ఆటో అండ్ మోటార్ వర్కర్స్, హమాలీ మరియు ఇతర రంగాలు, బీడీ కార్మికులు ఎదుర్కొంటున్న అనేక సమస్యల పరిష్కారం కోసం, వేతనాల పెంపు, ఉద్యోగ ఆరోగ్య భద్రత కోసం మన యూనియన్ రాజీ లేకుండా పోరాడిందన్నారు. అనేక విజయాలు సాధించిందనీ, మరెన్నో విజయాలను సాధించాల్సింది ఉందన్నారు. అందులో భాగంగానే గత పోరాటాలను సమీక్షించుకుని, భవిష్యత్తు కార్యాచరణను రూపొందించుకోవడం కోసం ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా జిల్లా ప్రథమ మహాసభను జరుపుకుంటున్నదనీ, జిల్లాలోని అన్ని రంగాల కార్మికులు, ప్రజలు ప్రజాస్వామ్యవాదులు, ఉద్యోగ, మేధావులు, వ్యాపార వర్గాలు మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ కామారెడ్డి జిల్లా కార్యదర్శి పి రామకృష్ణ, రాష్ట్ర నాయకులు బి దేవారం, టియుసిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి రమేష్, జిల్లా నాయకులు ప్రకాష్ , అరవింద్, పిఓడబ్ల్యు జిల్లా నాయకులు అనిత, రాజేశ్వర్, బాబన్న, కిషన్, రమేష్, కిషోర్, పిడిఎస్యు జిల్లా అధ్యక్షుడు సురేష్, నరేందర్, అనిల్ రాందాస్ దామోదర్ నడిపి నరసయ్య రాజన్న , తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలకు పరేడ్ గ్రౌండ్ ముస్తాబు.





**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, జూన్ 01**

తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్ ను అన్ని విధాలుగా ముస్తాబు చేశారు. కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ ఇప్పటికే అధికారులతో సమీక్ష నిర్వహించి వేడుకల నిర్వహణ ఏర్పాట్లపై దిశా నిర్దేశం చేశారు. ఈ వేడుకలకు రాష్ట్ర ఖనిజ అభివృద్ధి సంస్థ చైర్మన్ అనిల్ ఈరవత్రి ముఖ్య అతిథిగా హాజరై ఉదయం 10.00 గంటలకు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించనున్నారు. అంతకుముందు వినాయకనగర్ లోని అమరవీరుల స్థూపం వద్ద తెలంగాణ అమరవీరులకు ముఖ్య అతిథితో పాటు ప్రజాప్రతినిధులు, అధికారులు శ్రద్ధాంజలి ఘటించనున్నారు.

రాష్ట్ర అవతరణ వేడుకలలో లోటుపాట్లకు తావులేకుండా, పరేడ్ మైదానాన్ని సుందరంగా ముస్తాబు చేశారు. ప్రభుత్వం అట్టహాసంగా ఈ వేడుకలను చేపడుతున్న నేపథ్యంలో మరింత విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు.

# మున్నూరు కాపులు అన్ని రంగాల్లో రాణించాలి





**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, జూన్ 1:**

**రాజ్యసభసభ్యులు డాక్టర్ లక్ష్మణ్.**

**విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేత.**

మున్నూరు కాపులు కేవలం వ్యవసాయం, రాజకీయ రంగంలోనే కాకుండా, విద్యారంగంతో పాటు అన్ని రంగాల్లో రాణించాలనీ బిజెపి ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షులు, రాజ్యసభసభ్యులు డాక్టర్ లక్ష్మణ్ పిలుపునిచ్చారు. తెలంగాణ మున్నూరు కాపు ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో నగరంలో ఆదివారం ఇంటర్మీడియట్, పదో తరగతిలో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందించారు. కార్యక్రమానికి రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ, మున్నూరు కాపు విద్యార్థులు చదువులో ముందుండి వివిధ గొప్ప రంగాల్లో ఎదగాలని, తద్వారా దేశానికి, కులానికి మంచి పేరు తీసుకురావాలని అన్నారు. చదువుతోపాటు వివిధ అత్యున్నతమైన పురస్కారాల్లో రాణించి మున్నూరు కాపుల లక్ష్యాన్ని నెరవేర్చవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. అలాగే చదువులోనే కాకుండా వివిధ క్రీడల్లో కూడా జాతీయ, అంతర్జాతీయ స్థానాలను ప్రతిభను చాటి మున్నూరు కాపుల సత్తా ఏంటో సాటి చెప్పాలన్నారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం సైతం విద్యారంగ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెడుతుందని ఆయన అన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. పదవ తరగతిలో హైయెస్ట్ మార్కులు 586 సాధించిన విద్యార్థికి పురస్కారాలు అందించారు. ఇంటర్మీడియట్లో 994 సాధించిన విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలు అందించారు. మొత్తం 115 మంది విద్యార్థులకు ప్రతిభా పురస్కారం అందజేశారు( ఎస్ఎస్సి 72 , ఇంటర్ 40 టిజిసెట్ ఐదు). ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షుడు దినేష్ కుల చారి పటేల్, తెలంగాణ మున్నూరు కాపు ప్రభుత్వ ఉద్యోగుల, విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు జిల్లా తోట రాజశేఖర్, రాష్ట్ర అధ్యక్షుడు బాల శ్రీనివాస్ పటేల్, ధర్మపురి సురేందర్, నరాల రత్నాకర్, ప్రధాన కార్యదర్శి అబ్బాపూర్ రవి, బుస్సా ఆంజనేయులు, ఆకుల ప్రసాద్, రేంజర్ల నరేష్, హరిచరణ్ తదితరులు పాల్గొన్నారు.

# పార్టీ కోసం కష్టపడిన వారికి పదవులివ్వాలి

**హైదరాబాద్, వరంగల్:** ఏళ్ల తరబడి పార్టీ కోసం కష్టపడుతున్న వారికి తగిన గుర్తింపునివ్వాలని పలువురు ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఇతర నేతలు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్‌కు విన్నవించారు. సికింద్రాబాద్, వరంగల్, నాగర్‌కర్నూల్ లోక్‌సభ నియోజకవర్గాల పరిధిలోని నేతలతో ఆదివారం ఆమె ఎమ్మెల్యే క్వార్టర్స్‌లోని తన కార్యాలయంలో ముఖాముఖి మాట్లాడారు. ఒక్కొక్కరిని పిలిచి వారి నియోజకవర్గంలో పార్టీ పరిస్థితి, వర్గాల పోరు ఏమైనా ఉందా? సమస్యలున్నాయా? తక్షణం పార్టీ అధిష్ఠానం చేయాల్సిన పనులు ఏమిటి? అని అడిగినట్లు తెలిసింది. తమకు గుర్తింపు ఇవ్వడం లేదని, పార్టీలోని వర్గాల సమస్యలను పలువురు నేతలు ఆమెకు చెప్పినట్లు సమాచారం. ప్రధానంగా వరంగల్ లోక్‌సభ పరిధిలో మంత్రికి, ఇతర నేతలకు మధ్య అంతరం ఉందని, ఎవరికి వారు అన్నట్లుగా వ్యవహరిస్తున్నారని మీనాక్షికి ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది.

కొందరు నేతలు బహిరంగంగా చేస్తున్న వ్యాఖ్యలు కూడా పార్టీకి, ప్రభుత్వానికి నష్టం కలిగిస్తున్నాయని గత ఏడాది కాలంలో జరిగిన కొన్నింటిని ఉదహరించినట్లు నేతలు తెలిపారు. పార్టీకి నష్టం కలిగించే నేతలపై అధిష్ఠానం చర్యలు తీసుకోకపోతే నష్టం జరుగుతుందని చెప్పినట్లు వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను సమర్థంగా అమలుచేస్తున్నా.. వాటి గురించి జిల్లాల్లో ముఖ్య నేతలు సరిగా ప్రచారం చేయడం లేదని, దీనివల్ల ప్రభుత్వం ఏమీ చేయడం లేదని ప్రతిపక్షాలు చేస్తున్న ప్రచారం ప్రజల్లోకి ఎక్కువగా వెళుతోందని చెప్పినట్లు సమాచారం. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాదిన్నరైనా నామినేటెడ్ పదవులను భర్తీ చేయకపోవడంతో అందరూ అడుగుతున్నారని ఎమ్మెల్యేలు, ఎంపీలు చెప్పారు. స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్నందున.. పార్టీ కోసం ఎంతోకాలంగా కష్టపడిన వారిని గుర్తించి పదవులు ఇస్తే తిరిగి పనిచేస్తారని వారు సూచించారు. గ్రేటర్ హైదరాబాద్ నగర పాలక సంస్థకు జరగబోయే ఎన్నికల్లో గెలిచేందుకు పార్టీ బలోపేతంపై అధిష్ఠానం దృష్టి పెట్టాలని కోరినట్లు తెలుస్తోంది. అసెంబ్లీ నియోజకవర్గ అభివృద్ధి పద్దు కింద ప్రతి ఎమ్మెల్యేకు నిధులను ఎప్పటికప్పుడు మంజూరు చేయాలని కూడా పలువురు కోరారు.

వేగుచుక్క
పీడిత ప్రజల గొంతుక...

# సీఎం రేవంత్ రెడ్డిని ఆహ్వానించిన నాగార్జున

అఖిల్, జైనబ్ వివాహా వేడుకకు తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డిని నాగార్జున ఆహ్వానించారు. ఈ మేరకు వధూవరుల దంపతులు వెళ్లి సీఎంను ప్రత్యేకంగా ఆహ్వానించారు. మరి సీఎంతో నాగార్జునకు కోల్డ్ వార్ నడుస్తుంటుందన్న సంగతి తెలిసిందే. ఎన్ కన్వెన్షన్ కూల్చివేతతో ప్రభుత్వంతో నాగార్జునకు చెడిందనే వార్తలు వచ్చాయి. మరి ఇలాంటి తరుణంలో సీఎం రేవంత్ రెడ్డిని నాగార్జున ఇలా ప్రత్యేకంగా ఆహ్వానించడంపై అందరి దృష్టి పడింది. మరి మున్ముందు వీరిద్దరి మధ్య ఎలాంటి సాన్నిహిత్యం నెలకొంటుందో చూడాలి.

టాలీవుడ్ కింగ్ నాగార్జున తాజాగా తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. అఖిల్, జైనబ్ వివాహా వేడుకకు రావాల్సిందిగా సీఎం రేవంత్ రెడ్డిని కలిసి ఆహ్వానం అందించారు. అమల, నాగార్జున, జైనబ్ పేరెంట్స్ కలిసి సీఎంను కలిసి పెళ్లికి రావాల్సిందిగా ఆహ్వానించారు. ప్రస్తుతం ఈ మేరకు వీరంతా కలిసి దిగిన ఓ ఫోటో వైరల్ అవుతోంది. జూన్ 6న అఖిల్ పెళ్లి అన్నట్టుగా తెలుస్తోంది.

ఎన్ కన్వెన్షన్ కూల్చివేత దగ్గరి నుంచి సీఎం రేవంత్ రెడ్డికి, నాగార్జునకు కోల్డ్ వార్ జరుగుతోందనే ప్రచారం వచ్చింది. ఎన్ కన్వెన్షన్ కావాలనే కూల్చారని ప్రతిపక్షాలు కూడా ఆరోపణలు చేసిన సంగతి తెలిసిందే. ఫండ్ ఇవ్వలేదన్న కారణంతోనే ఇలా చేశారని ప్రతిపక్షాలు మాట్లాడిన మాటలు బాగానే వైరల్ అయ్యాయి. స్టే ఆర్డర్‌లు, కోర్టు కేసులకు విరుద్ధంగా ఎన్ కన్వెన్షన్‌కు సంబంధించి కూల్చివేతలు చేపట్టడం



బాధాకరం అంటూ అప్పుడు నాగార్జున వేసిన ట్వీట్ కూడా బాగానే వైరల్ అయింది.

ఇక ఇప్పుడు ఇలా అఖిల్ పెళ్లి కోసం ఆహ్వానించేందుకు సీఎం ఇంటికి వెళ్లారు నాగార్జున. అమల, నాగ్, జైనబ్ పేరెంట్స్ అంతా కలిసి సీఎం ఇంటికి వెళ్లి పెళ్లికి రావాలని ప్రత్యేకంగా ఆహ్వానించారు. ప్రస్తుతం ఈ ఫోటో బయటకు రావడంతో ఎన్ కన్వెన్షన్ మ్యాటర్ మరోసారి చర్చల్లోకి వచ్చింది. ఇక అసలే మనం సినిమాకు అవార్డు ఇవ్వలేదని అక్కినేని ఫ్యాన్స్ అంతా కూడా హర్ట్ అయిన సంగతి తెలిసిందే.

2014 నుంచి గద్దర్ అవార్డుల్ని ప్రకటించారు. గత పదేళ్లలో వచ్చిన బెస్ట్ మూవీస్‌కి ఉత్తమ చిత్రాలుగా ప్రకటించారు. అయితే అందులో మనం సినిమాకు మాత్రం చోటు కల్పించలేదు. దీంతో కావాలనే చేశారేమో అనే వాదన కూడా వచ్చింది. అయితే 2014 జూన్ 2 తరువాత సెన్సార్ అయిన చిత్రాలను మాత్రమే పరిగణలోకి తీసుకున్నారని తెలుస్తోంది.

ఇక అఖిల్, జైనబ్ ఎంగేజ్మెంట్ ఘనంగా జరిగిన సంగతి తెలిసిందే. అక్కినేని ఫ్యామిలీ, టాలీవుడ్ సెలెబ్రిటీల రాకతో వాతావరణం సందడిగా మారింది. ఇక అఖిల్, జైనబ్ జోడి అప్పట్లో బాగానే ట్రెండ్ అయింది. ఇప్పుడు అఖిల్ తన పెళ్లి పనుల్లో బిజీగా ఉన్నట్టు తెలుస్తోంది. మరి పెళ్లి తరువాత అయినా అఖిల్ సుడి తిరుగుతుందా? లేదా? అన్నది చూడాలి. ఏజెంట్ తరువాత చాలా గ్యాప్ తీసుకున్న అఖిల్ ప్రస్తుతం ఓ పీరియాడిక్ మూవీని చేస్తున్న సంగతి తెలిసిందే. ఇప్పటికే అఖిల్, శ్రీలీల మీద వదిలిన గ్లింప్స్ అందరినీ ఆకట్టుకుంది.

# నానికి సారీ చెప్పిన ఎస్ జే సూర్య..






తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన గద్దర్ సినిమా అవార్డుల్లో భాగంగా ఎస్ జే సూర్యకు బెస్ట్ సపోర్టింగ్ యాక్టర్ కేటగిరీలో పురస్కారం లభించిన సంగతి తెలిసిందే. సరిపోదా శనివారం సినిమాలో ఎస్ జే సూర్య నటనకు గానూ ఈ ఉత్తమ సహాయ నటుడు అవార్డుని ప్రకటించారు. ఈ ప్రకటనతో టీం అంతా ఖుషీ అయింది. ఎస్ జే సూర్య సైతం ప్రభుత్వానికి థాంక్స్ చెప్పాడు. నాని కూడా సూర్య ట్వీట్ మీద రియాక్ట్ అయ్యాడు.

నాని, ఎస్ జే సూర్య నటించిన 'సరిపోదా శనివారం' చిత్రానికి మంచి ప్రశంసలు, కలెక్షన్స్ వచ్చిన సంగతి తెలిసిందే. సరిపోదా శనివారం చిత్రంలో నాని కంటే ఎక్కువగా ఎస్ జే సూర్యకే పేరు వచ్చిన సంగతి తెలిసిందే. నాని యాక్టింగ్‌ను ఎస్ జే సూర్య డామినేట్ చేశాడని, ఆ మూవీకి సూర్య నటనే ప్లస్ అని అంతా అన్నారు. స్టేజ్ మీద నాని కూడా ఈ విషయాన్ని ఒప్పుకున్నారు. అసలు కథ విన్నప్పుడే ఆ విషయం తనకు అర్థమైందని, ఎస్ జే సూర్య తన నటనతో సినిమాను మరో స్థాయికి తీసుకెళ్లాడని నాని కూడా అన్నారు.

ఇక తాజాగా తెలంగాణ ప్రభుత్వం గద్దర్ అవార్డుల్ని ప్రకటించింది. ఇందులో ఉత్తమ సహాయ నటుడు కేటగిరీలో ఎస్ జే సూర్యకు అవార్డు ఇచ్చారు. సరిపోదా శనివారం సినిమాలో కనబర్చిన నటనకు గానూ ఎస్ జే సూర్యకు ఈ అవార్డును ఇచ్చారు. ఇక దీంతో సరిపో దా టీం ఫుల్ ఖుషీ అయిం ది. ఎస్ జే సూర్య సైతం చాలా సంతోషంగా ఉన్నా రు. తెలంగాణ ప్రభుత్వా నికి థాంక్స్ చెబుతూ ట్వీట్ కూడా వేశాడు.

ఇక ఎస్ జే సూర్య వేసిన ట్వీట్‌కు నాని కూడా స్పందించాడు. కంగ్రాట్స్ సర్ అని రిప్లై ఇచ్చాడు నాని. అయితే నాని ట్వీట్‌కు నిన్న ఎస్ జే సూర్య స్పందించాడు. థాంక్యూ సర్ అని సింపుల్‌గా రిప్లై ఇచ్చాడు. అయితే నిన్న ఏదో మూవీ షూటింగ్‌లో ఉండటం, ఆ బిజీ వల్ల సరిగ్గా రిప్లై ఇవ్వలేదట. అందుకే మళ్లీ ఓ ట్వీట్ వేశాడు. ఒక చిన్న థాంక్యూ చెబితే సరిపోదు అంటూ ఎస్ జే సూర్య స్పందించాడు. డియర్ నేచురల్ స్టార్ నాని సర్.. మీకు ముందుగా సారీ చెబుతున్నా.. నిన్న అంతా షూటింగ్‌లో బిజీగా ఉండటంతో మీకు సరిగ్గా రిప్లై ఇవ్వకుండా.. కేవలం థాంక్యూ అని చెప్పేశాను. కానీ అది సరిపోదని నాకు తెలుసు.. మీరు గానీ, డైరెక్టర్ వివేక్ గానీ లేకపోతే ఇదంతా సాధ్యం అయ్యేది కాదు.. మీరు ఇచ్చిన సపోర్ట్‌కు థాంక్స్.. మీరు తెరపై మాత్రమే హీరో కాదు.. తెర వెనుక కూడా హీరోనే.. అని పొగిడేశాడు ఎస్ జే సూర్య. మరి ఈ ట్వీట్‌కు నాని ఎలా రియాక్ట్ అవుతాడో చూడాలి. ఇక ఎస్ జే సూర్య పోషించిన పాత్ర, చెప్పిన డైలాగ్స్‌తో వచ్చిన మీమ్స్ అందరికీ తెలిసిందే.

# ఇప్పుడిలా చేస్తానని అస్సలు ఊహించలేదు





సమంత మయోసైటిస్ కారణంగా కనీసం వాటర్ గ్లాస్ కూడా ఎత్తలేని స్థితిలోకి వెళ్లిన సంగతి తెలిసిందే. అయితే ఇప్పుడు మెల్లిమెల్లిగా సమంత కోలుకుంటోన్నారు. ఇప్పుడు జిమ్‌లో సమంత మునుపటిలా పూర్తి శక్తివంతంగా మారారు. 90, 100 కేజీల బరువుని ఎత్తి అందరినీ ఆశ్చర్యపరిచారు. సమంత ప్రస్తుతం మునుపటిలా ఫుల్ ఎనర్జిటిక్‌గా మారారు.

ఒకప్పుడు సమంత జిమ్‌లో వంద కేజీల బరువు ఎత్తేవారు. కరోనా టైంలో ఆమె మయోసైటిస్ బారిన పడిన తరువాత కథ మొత్తం మారింది. కనీసం వాటర్ గ్లాస్, కాఫీ కప్పు గానీ ఎత్తలేని స్థితిలోకి వెళ్లారు. ఇక లేచి నడుస్తున్నా? అన్న పరిస్థితి నుంచి ఇప్పుడు ఇలా జిమ్‌లో 90, 100 కేజీల బరువు ఎత్తే వరకు ప్రయాణం సాగిందంటూ సమంత తన జర్నీ గురించి చెప్పుకొచ్చారు. ఈ వారం రోజుల్లో జిమ్‌లో ఎంత కష్టపడ్డారో వీడియో ద్వారా చూపించారు.

సమంత తాజాగా ఈ వారంతా జిమ్‌లో చేసిన వర్కౌట్ల గురించి చెప్పుకొచ్చారు. ప్రతీ సారి నేను నా కంఫర్ట్ జోన్‌ను వదిలేసి ప్రయత్నిస్తుంటాను.. అలా చేసినప్పుడే నాలోని కొత్త యాంగిల్‌ను నేను తెలుసుకుంటూ ఉంటాను.. కంఫర్ట్ లేనప్పుడే మనం ఎంత స్ట్రాంగ్ అన్నది తెలుస్తుంది.. ఈ రోజు నేను 90 కేజీల బరువు ఎత్తాను.. అసలు ఇలాంటి ఓ రోజు మళ్లీ వస్తుందని అస్సలు అనుకోలేదు అంటూ సమంత చెప్పుకొచ్చారు. బలం అనేది మెల్లిమెల్లిగా మనకు చేకూరుతుంటుంది.. ఏదో ఒక రోజు వంద కేజీల బరువు ఎత్తుతాను.. ఒకప్పుడు అయితే నీటి జగ్గుని కూడా ఎత్తలేకపోయేదాన్ని అంటూ సమంత తన మయోసైటిస్ రోజుల్ని తలుచుకున్నారు. సమంత మొత్తానికి అన్ని రకాల వైద్యాల్ని ట్రై చేశారు. ప్రకృతి వైద్యం, ఆయుర్వేదం, మూలికలు, ఐస్ బాత్ ఇలా అన్ని రకాల చికిత్సలను తీసుకున్నారు. సమంత ప్రస్తుతం మళ్లీ సినిమాల మీద ఫోకస్ పెట్టిన సంగతి తెలిసిందే. మయోసైటిస్ వల్ల మునుపటిలా యాక్షన్ చేయలేనని భావించిన సమంత ట్రాలాలా ప్రొడక్షన్‌ను స్టార్ట్ చేశారు. 'శుభం' అంటూ తన తొలి ప్రాజెక్టుని కొత్త వారితో తీశారు. 'శుభం' చిత్రానికి మంచి ప్రశంసలు దక్కిన సంగతి తెలిసిందే. నిర్మాతగా సమంతకు 'శుభం' శుభ పరిణామం గానే మారింది. ప్రవీణ్ కండ్రేగుల దర్శకత్వంలో సమంత నిర్మించిన ఈ చిత్రానికి రాజ్ నెడుమూరి క్రియేటివ్ ప్రొడ్యూసర్‌గా వ్యవహరించారు. ఇకపై తన ప్రొడక్షన్ కంపెనీ మీద కొత్త వాళ్లకు అవకాశాలు ఇస్తూనే ఉంటారని సమాచారం. కొత్త కథలు, డిఫరెంట్ కాన్సెప్ట్‌లను సమంత ఎంచుకుంటూ ముందుకు వెళ్లేలా ఉన్నారు. సమాన పనికి సమాన వేతనం అనే కాన్సెప్ట్‌తో సమంత తన ట్రాలాలాను నడిపిస్తానని ఇది వరకే చెప్పిన సంగతి తెలిసిందే.

# ఒకే డైరెక్టర్‌తో 36 సినిమాలు..

సూపర్ స్టార్ కృష్ణ తెలుగు సినిమా చరిత్రలో తనకంటూ ఒక ప్రత్యేక పేజీని లిఖించుకున్నారు. దాదాపు ఆరు దశాబ్దాల పాటు సినీ రంగానికి తన సేవలు అందించారు. హీరోగానే కాకుండా దర్శకుడిగా, నిర్మాతగా తనదైన ముద్ర వేశారు. సాంకేతికంగా అనేక కొత్త విషయాలను తెలుగు తెరకు పరిచయం చేసిన ఆయన.. నిర్మాతల హీరోగా పేరు తెచ్చుకున్నారు. స్టార్ ఇమేజ్ ను పక్కనపెట్టి మరీ ఎన్నో ప్రయోగాలు చేసారు. ఒకే ఏడాదిలో 17 సినిమాలు విడుదల చేసి రికార్డు సృష్టించారు. నేడు కృష్ణ జయంతి సందర్భంగా ఆయన కెరీర్ లోని ఆసక్తికరమైన విషయాలు మీకోసం..

ఇండియన్ సినిమా హిస్టరీలో తనకంటూ ఓ పేజీని లిఖించుకున్న లెజెండరీ నటుడు సూపర్ స్టార్ ఘట్టమనేని కృష్ణ. ఐదున్నర దశాబ్దాల పాటు సినీ రంగానికి తన సేవలు



అందించిన ఆయన.. నటుడిగానే కాకుండా దర్శకుడిగా, నిర్మాతగా, స్టూడియో అధినేతగా రాణించారు. 360కి పైగా చిత్రాల్లో నటించి, తెలుగు సినీ చరిత్రలో చెరగని ముద్ర వేసుకున్నారు. టెక్నికల్ గా తెలుగు సినిమాకు అనేక కొత్త విషయాలను పరిచయం చేసిన కృష్ణ.. సాహసమే శ్వాసగా సాగిపోయారు.. డేరింగ్ అండ్ డాషింగ్ అనిపించుకున్నారు. నేడు (మే 31) ఆ నటశేఖరుడి 82వ జయంతి సందర్భంగా, ఆయన సినీ ప్రస్థానంలోని కొన్ని అద్భుత ఘట్టాలను గుర్తు చేసుకుందాం.

కృష్ణ పూర్తి పేరు ఘట్టమనేని శివరామకృష్ణ మూర్తి. 1943 మే 31న గుంటూరు జిల్లా తెనాలి మండలం బుర్రిపాలెంలో జన్మించారు. చిన్న పాత్రలతో సినీ కెరీర్ మొదలుపెట్టి, 1965లో 'తేనె మనసులు' అనే చిత్రంతో హీరోగా పరిచయమయ్యారు. కెరీర్ ప్రారంభంలోనే తెలుగు సినిమాకు ఎన్నో కొత్త ట్రెండ్‌లను పరిచయం చేశారు. ఈస్ట్‌మన్ కలర్, సినిమా స్కోప్, 70%వీవీ%, కౌబాయ్ సినిమాలు, జేమ్స్ బాండ్ తరహా చిత్రాలని తెలుగు తెరకు ఇంట్రడ్యూస్ చేసారు. ఆయన నటించిన 'తొలి అడుగులు' ఈస్ట్‌మన్ కలర్‌లో విడుదలైన తొలి తెలుగు చిత్రంగా చరిత్రకెక్కింది. 'మోసగాళ్లకు మోసగాడు' (1971) తెలుగులో మొట్టమొదటి కౌబాయ్ సినిమాగా ప్రేక్షకులను సరికొత్త అనుభూతిని పంచింది.

'గూఢచారి 116' చిత్రంతో తెలుగులో జేమ్స్ బాండ్ తరహా సినిమాలకు ఆద్యుడయ్యారు కృష్ణ. ఈ మూవీతో ఆయన ఓవర్ నైట్ స్టార్‌గా మారిపోయారు. 'అల్లూరి సీతారామరాజు' (1974) మొదటి సినిమాస్కోప్ చిత్రంగా సంచలనం సృష్టించగా.. ఆయన స్వీయ దర్శక నిర్మాణంలో వచ్చిన 'సింహాసనం' (1986) తెలుగులో మొట్టమొదటి 70 ఎంఎం చిత్రంగా నిలిచింది. కృష్ణ 25 సినిమాల్లో ద్విపాత్రాభినయం చేయగా.. 7 సినిమాల్లో త్రిపాత్రాభినయం చేసి మెప్పించారు. తన కెరీర్లో దాదాపు 80 మందికి పైగా హీరోయిన్లతో నటించారు. పద్మాలయ స్టూడియోస్ బ్యానర్ లో తెలుగు, హిందీ భాషల్లో 50కి పైగా సినిమాలను నిర్మించారు.

### ఒకే ఏడాదిలో 17 సినిమాలు..

భారతీయ చిత్ర పరిశ్రమలో అత్యంత వేగంగా సినిమాలు చేసిన హీరో కృష్ణ. ఆయన కెరీర్‌లో ఒకే ఏడాదిలో 17 సినిమాలను విడుదల చేయడం ఒక అద్భుతమైన రికార్డు. 1972 సంవత్సరంలో ఈ అసాధారణమైన ఘనతను సాధించారు. ఒక నటుడు ఒకే ఏడాదిలో ఇన్ని చిత్రాలలో నటించడమే కాకుండా, రిలీజ్ చేయడం అనేది భారతీయ సినిమా చరిత్రలోనే చాలా అరుదు. ఈరోజుల్లో స్టార్ హీరోల రెండు మూడేళ్ళకి ఒక సినిమా చేయడమే గగనమైపోయింది. అలాంటిది ఒక సంవత్సరంలో 17 సినిమాలు అంటే మామూలు విషయం కాదు. దీన్ని బట్టే సినిమా పట్ల ఆయనకు ఎంత అంకితభావం ఉందనేది అర్థమవుతుంది.

### నిర్మాతల హీరో...

కృష్ణకు నిర్మాతల హీరో అనే పేరుంది. ఏదైనా సినిమా ఫ్లాప్ అయితే, నిర్మాతను పిలిచి వెంటనే మరో సినిమా చేయడం ఆయనకు అలవాటు. రెమ్యునరేషన్ పట్టించుకోకుండా, డబ్బులు ఇచ్చినా ఇవ్వకపోయినా సినిమాలు చేయడం ఆయనకే చెల్లింది. అందుకే కాల్ షీట్స్ కోసం నిర్మాతలు క్యూ కట్టేవారు. ఇక దర్శకుడు కె.ఎస్.ఆర్. దాస్ (కోడి రామకృష్ణ ప్రసాద్ దాస్)తో కృష్ణకు స్పెషల్ బాండింగ్ ఉంది. టాలీవుడ్ లో మోస్ట్ సక్సెస్ ఫుల్ డైరెక్టర్-హీరో కాంబినేషన్స్ లో వీరి గురించి ప్రత్యేకంగా చెప్పుకోవాలి. వీరిద్దరూ కలిసి 36 సినిమాలు వస్తే, వాటిల్లో ఎక్కువ శాతం సూపర్ హిట్లు అయ్యాయి.

### ఒకే దర్శకుడితో 30 సినిమాలు..

కృష్ణ - కె.ఎస్.ఆర్. దాస్ కాంబోలో 'మోసగాళ్లకు మోసగాడు', 'పండంటి కాపురం', 'దేవదాసు', 'అగ్నిపర్వతం', 'కొండవీటి సింహం', 'కొండవీటి సింహం', 'ఊరికి మొనగాడు', 'నాగుపాము', 'సింహాసనం', 'గురు శిష్యులు', 'మహాసంగ్రామం', 'చల్లని తల్లి', 'మహా పరాక్రమం', 'భలే కృష్ణ', 'గూఢచారి 116', 'టక్కరి దొంగ చక్కని చోరుడు', 'అసాధ్యుడు', 'పాడిపంటలు', 'పాపికొండలు', 'రక్త సంబంధాలు', 'మాయదారి మల్లిగాడు', 'మనుష్యులు మారాలి', 'నేను దొంగను', 'దొంగల వేట', 'రాజసింహం', 'కలియుగ కృష్ణుడు' వంటి సినిమాలు వచ్చాయి. ఒక దర్శకుడితో ఇన్ని సినిమాలు చేసిన హీరోలుగా చాలా అరుదుగా ఉంటారు. కృష్ణ బౌతికంగా లేకపోయినా.. ఆయన చేసిన ప్రయోగాలు, సినిమాలు, సృష్టించిన రికార్డులు ఎప్పటికీ చిరస్మరణీయం.

# వ్యాఖ్యలు సరి కాదు



హరి హర వీరమల్లు మూవీని అడ్డుకునేందుకు మాత్రమే ఈ థియేటర్ల బంద్ ప్రకటించారని పవన్ కళ్యాణ్, మంత్రి కందుల దుర్గేశ్ అనడం సరి కాదని ఆర్ నారాయణ మూర్తి అన్నాడు. ప్రస్తుతం సింగిల్ థియేటర్లు దుర్భర పరిస్థితులు ఎదుర్కొంటున్నాయని, పర్సెంటేజీ విధానం అమలు అవ్వాల్సిందే అని ఆయన అన్నారు. ఇక టికెట్ రేట్ల పెంపు అంశం మీద ఆర్ నారాయణమూర్తి తన అభిప్రాయాన్ని వెల్లిబుచ్చారు.

పీపుల్స్ స్టార్ ఆర్ నారాయణమూర్తి తాజాగా థియేటర్ల సమస్యల మీద స్పందించారు. సింగిల్ థియేటర్లు ఎదుర్కొంటున్న కష్టాల్ని వివరించారు. అక్కడ కచ్చితంగా పర్సంటేజీ విధానం అమలు కావాలని అన్నారు. పర్సంటేజీ సిస్టం కోసం పోరాడుతూ బంధ్ ప్రకటిస్తే.. అది హరి హర వీరమల్లుని అడ్డుకునేందుకు చేస్తున్నారని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి కందుల దుర్గేశ్ అనడం సరి కాదని ఆర్ నారాయణమూర్తి అన్నారు. పర్సంటేజీ విధానం వస్తుందని, చిన్న సినిమాల్ని తీసే తనలాంటి నిర్మాతల కష్టాలు తొలగుతాయని అనుకున్నానని నారాయణమూర్తి అన్నారు.



కానీ ఇలా హరి హర వీరమల్లు సినిమాను అడ్డుకునేందుకు థియేటర్ల బంద్‌ను తెరపైకి తీసుకు వచ్చారని స్వయానా మంత్రి కందుల దుర్గేశ్ అనడం సరి కాదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇక పాప్ కార్న్ రేట్, థియేటర్లో టికెట్ రేట్లు ఇవన్నీ కలిసి సామాన్యుడ్ని సినిమాకు దూరం చేస్తున్నాయని వాపోయారు. అసలు టికెట్ రేట్ల పెంపు కోసం ఎందుకు అడుగుతున్నారు? ఎందుకు పెంచుతున్నారు? అని ప్రశ్నించారు.

హాలీవుడ్‌లో వేల కోట్లు పెట్టి 10 కమాండెంట్, బెనహార్ వంటి చిత్రాలు తీశారని, కానీ వారెప్పుడూ అక్కడ టికెట్ రేట్లను పెంచమని అడగలేదని గుర్తు చేశారు. మొఘల్ ఏ ఆజాం, షోలే వంటి చిత్రాల్ని ఎన్నో ఏళ్లు కష్టపడి తీశారని అయినా కూడా ఎక్కడా టికెట్ రేట్లను పెంచలేదని అన్నారు. ఇక లవకుశ సినిమాను ఐదేళ్లు కష్టపడి తీసి అప్పుల పాలైనా కూడా టికెట్ రేట్లను పెంచలేదని గుర్తు చేశారు. సినిమా బాగుంటే జనాలు వస్తారు.. హిట్ చేస్తారు.. లారీల్లో, గూడ్స్ ట్రైన్లలో తీసుకు వెళ్లేంత లాభాల్ని ఇస్తారు అని నారాయణమూర్తి అన్నారు.

వేల కోట్ల బడ్జెట్‌లు పెట్టి, సినిమాలు తీస్తున్నారని, దానికి మేం గర్విస్తున్నామని, కానీ టికెట్ రేట్లు ఎందుకు పెంచుతున్నారని ప్రశ్నించారు. మామూలు టికెట్ రేట్లతోనే రిలీజ్ చేయండి.. సామాన్యుడికి సినిమాను ఎందుకు దూరం చేస్తున్నారు.. ఉన్న ఒక్క వినోదాన్ని ఎందుకు అంత కాస్ట్ లీ చేస్తున్నారు అంటూ నిలదీశారు. బంధ్ అనేది ప్రజా స్వామ్యంలో బ్రహ్మాస్త్రం అని అన్నారు. బంధ్ ప్రకటించే హక్కు అందరికీ ఉంటుం దని అన్నారు. అయితే మూడు వారాల ముందు ఫిల్మ్ ఛాంబర్‌కి తెలియపర్చాలని అన్నారు. జూన్ 1న బంధ్ ప్రకటిస్తే.. మూడు వారాల ముందు చెప్పలేదు కాబట్టి అది వర్తించదు.. అయినా ఇది హరిహర వీరమల్లుకి ఎలా వరిస్తుంది ?.. పవన్ కష్టపడి డిప్యూటీ సీఎం అయ్యార ంటే ఎంతో గర్విస్తాను.. డిప్యూటీ సీఎంగా ఉండి.. హరి హర వీరమల్లు టాపిక్ ఎత్తకుండా ఉండాల్సింది.. అలా చేసి ఉంటే మిమ్మల్ని చూసి మరెంతో గర్వించే వాడ్ని.. చిన్న నిర్మాతలు కష్టాల్ని ఎదుర్కొంటు న్నారు.. సింగిల్ స్క్రీన్ థియేటర్లు మూసే పరిస్థితికి వచ్చింది అంటూ నారాయణమూర్తి ఆవేదన వ్యక్తం చేశారు.